క్లుప్తంగా

బాధితులకు ఎల్‌ఓసీ అందజేత

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని కొత్తూరు జ్ఞానదీప్‌గౌడ్, పెబ్బేరు పట్టణానికి చెందిన వాసు ఆస్పత్రి ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్పందించి ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. మంగళవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జ్ఞానదీప్‌గౌడ్‌కు రూ.1 లక్ష, వాసుకు రూ.75 వేల ఎల్‌ఓసీ కాపీని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్‌సాగర్, నాయకులు యుగేంధర్‌రెడ్డి, డైరెక్టర్లు మోతె రాములు, రామన్‌గౌడ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ఏర్పాటు



వీపనగండ్ల: మండల కేంద్రంలో గ్రామస్తుల సహకారంతో బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలోని పాత బస్టాండ్ వద్ద వసతులు లేకపోవడంతో కచ్చీర్ చెట్టు దగ్గర గ్రామంలోని పలువురు దాతల సహకారంతో మాజీ సర్పంచ్ పుట్ట గంగిరెడ్డి బస్‌షెల్టర్‌ను పూర్తి చేయించారు. త్వరలోనే బస్ షెల్టర్ వద్ద నీటి వసతి, మూత్రశాల ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. బస్‌షెల్టర్ నిర్మాణంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థినికి సన్మానం

కొత్తకోట రూరల్: మండలంలోని పాలెం జెడ్పీహెచ్‌ఎస్‌లో 2024–25లో 10వ తరగతిలో వైష్ణవి ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాలో మొదటి స్థానం సాధించింది. 'క్లాస్ మేట్ క్లబ్' వనపర్తి వారి ఆధ్వర్యంలో మంగళవారం పాలెం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థిని క్లబ్ నిర్వాహకులు, ఉపాధ్యాయ బృందం శాలువాతో సన్మానించి, సర్టిఫికెట్, నగదు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ సురేష్‌బాబు మాట్లాడారు. దాత రంజిత్, క్లబ్ వ్యవస్థాపకులు రాఘవేందర్ రాఘవేందర్‌కు పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

వనపర్తి రూరల్: పెబ్బేరు మున్సిపాలిటీకి నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఖాజా ఆరీఫొద్దీన్‌ను వారి కార్యాలయంలో మంగళవారం పెబ్బేరు పట్టణ జమే మజీద్ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జమే మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎండీ అఫ్సర్, ఉపాధ్యక్షుడు ఎండీ మస్జీద్, ఎండీ సిరాజుద్దీన్, ఉమ్మర్‌సాబ్, భద్రద్దీన్ పాల్గొన్నారు.

18 పందులు చోరీ

కొత్తకోట రూరల్: కొత్తకోట పట్టణంలో పందుల వ్యాపారులకు చెందిన షెడ్డులో 18 పందులను సోమవారం మధ్యరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఎస్‌ఐ ఆనంద్ వివరాల మేరకు.. పట్టణ కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో మటన్‌మార్కెట్ సమీపంలో పందుల వ్యాపారులు రవీందర్, తిరుపతయ్యలకు చెందిన పందులు రాత్రివేళల్లో షెడ్డులో ఉంచారు. ఉదయం లేచి చూసే సరికి షెడ్డులో పందులు లేకపోవడంతో ఆందోళన చెందిన వారు సీసీ కెమెరాలను పరిశీలించారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పందులు చోరీ చేసినట్లు సీసీ కెమెరాలో నమోదైంది. పందులను దొంగతనం చేసేందుకు ముగ్గురు వ్యక్తులు వచ్చినట్టు, పందులను వాహనంలో వేసుకుని ఆత్మకూర్ వైపు వెళ్లినట్టు సీసీ కెమెరాల్లో నమోదైంది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

మొబైల్ దుకాణంలో చోరీ

గోపాలపేట: మండల కేంద్రంలో వల్లెపు శివకుమార్ మొబైల్ దుకాణంలో చోరీ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. బాధితుడి వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శివకుమార్ శ్రీలక్ష్మి సెల్‌ఫోన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. యథావిధిగా సోమవారం రాత్రి 8 గంటలకు షాపును మూసి తాళం వేశాడు. మంగళవారం ఉదయం షెట్టర్ పగలగొట్టి ఉంది. దీన్ని చూసిన స్థానికులు యజమానికి సమాచారం అందించారు. దుకాణంలో నాలుగు పాత అండ్రాయిడ్ ఫోన్లు, చార్జర్లు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు క్లూస్ టీంను పిలిపించి వివరాలను సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మల్లన్నపై దాడిని ఖండిస్తున్నాం

వనపర్తిటౌన్: మేడిపల్లి ఎమ్మెల్సీ మల్లన్న, అతని క్యూ న్యూస్ ఛానల్‌పై దాడి చేసిన వారిపై పోలీసులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని బీసీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.కురుమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ భవనంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల కోసం తీన్మార్ మల్లన్న పార్టీ పెడతానంటే భయపడి దాడులు చేయించారన్నారు. దాడి చేసిన జాగృతి కార్యకర్తలు, ఎమ్మెల్సీ కవిత అనుచరుల మీద తక్షణమే పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్న రాములు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌సాగర్, బీసీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

బిల్లులు రాక.. వడ్డీలు కట్టలేక!



నాచారంపేటలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం

- ఇబ్బందులకు గురవుతున్న మాజీ సర్పంచ్‌లు
- అభివృద్ధి చేస్తే అప్పులే మిగిలాయని ఆవేదన
- తెచ్చిన అప్పులకు పెరిగిపోతున్న వడ్డీలు
- పదవీకాలం ముగిసి ఏడాదిన్నర గడిచినా మంజూరు కానీ నిధులు

కొత్తకోట రూరల్: ప్రజలు ఎంతో నమ్మకంతో గ్రామానికి సర్పంచ్‌గా ఓట్లు వేసి గెలిపించిన గ్రామస్తులకు, గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో మాజీ సర్పంచ్‌లు నిధులు మంజూరు కాకపోయినా సొంతంగా అప్పులు తెచ్చి గ్రామంలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశారు. అభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన వారికి అప్పులే మిగిలాయి. 2022, 2023లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సర్పంచ్‌లపై ఒత్తిడి తేవడంతో గత్యంతరం లేక బయట నుంచి అప్పులు తీసుకొచ్చారు. ఒక్కో గ్రామ పంచాయతీకి మాజీ సర్పంచ్‌లు సుమారు రూ.5లక్షల నుంచి రూ.20లక్షల వరకు పనులు పూర్తిచేసి బిల్లులు రాక ఎదురు చూస్తున్నారు. రెండేళ్లు గడుస్తున్నప్పటికీ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయలేదు. దీంతో నాటి సర్పంచ్‌లు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోవడంతో అవి ఎలా తీర్చాలని మనోవేదనకు గురవుతున్నారు. జిల్లాలో 14 మండలాలు, 255 గ్రామ పంచాయతీలున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ఎస్డీఎఫ్ నిధులు మంజూరు చేస్తామని చేయలేదు. అప్పట్లో గ్రామ సర్పంచ్‌లు అభివృద్ధి పనుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీ మీద వడ్డీలు పెరిగిపోతున్నాయి.

రెండేళ్లుగా పెండింగ్‌లోనే బిల్లులు..

గ్రామాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో మాజీ సర్పంచ్‌లు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరు కాకపోయినా అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల క్రితం మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బకాయి వివరాలు ఆయా జిల్లా కలెక్టర్లతో నివేదిక తీసుకుంది.

నూతన గ్రామ పంచాయతీ నిర్మాణం..

జిల్లాలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు భవనాలు లేకపోవడంతో పాటు పాత గ్రామాల్లో ఇదివరకు ఉన్న గ్రామ పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం కోసం రూ.26లక్షలు మంజూరు చేసింది. దీంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు సొంతంగా అప్పులు చేసి గ్రామ పంచాయతీలను నిర్మించారు. లక్షల రూపాయలు అప్పులు చేసి గ్రామ పంచాయతీ నిర్మాణం చేపట్టినా నేటికి వాటి బిల్లులు రాలేదు. దీంతో అప్పులు ఇచ్చిన వారు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆవేదనం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు పెడుతున్నారు..



నాచారంపేట గ్రామ పంచాయతీ నూతనంగా ఏర్పడటంతో పాత స్కూల్ బిల్డింగ్‌లో కొనసాగుతుండేది. నాటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వరెడ్డి ప్రత్యేక చొరవతో నూతన గ్రామ పంచాయతీ భవనం మంజూరు చేశారు. పనులు పూర్తి చేయాలనే ఉద్దేశంతో అప్పులు తెచ్చి భవన నిర్మాణం పూర్తి చేశాం. ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో అప్పులు పెరిగాయి. ఉన్నతాధికారులు, ప్రస్తుత పాలకులు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు వచ్చేలా కృషి చేయాలి.

– చంద్రకళ, మాజీ సర్పంచ్, నాచారంపేట

ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి..



గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో అప్పులు తీసుకొచ్చి గ్రామాల్లో శానిటేషన్, వీధిదీపాలు, మోటార్ల మరమ్మతు, ట్రాక్టర్‌కు డీజిల్, డంపింగ్ యార్డు, సీసీ రోడ్డు పనులు చేపట్టాం. తెచ్చిన డబ్బులకు వడ్డీల మీద వడ్డీలు పెరుగుతున్నాయి. బిల్లులు మాత్రం రావడం లేదు. ప్రభుత్వం స్పందించి మాజీ సర్పంచ్‌ల బిల్లులు విడుదల చేయాలని కోరుతున్నాం.

– ఆకుల శ్రీనివాసులు, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షులు, కొత్తకోట

సహకార సంఘాలకు ఎఫ్‌పీఓ నిధులు విడుదల

పాన్‌గల్: రాష్ట్రంలో ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్(ఎఫ్‌పీఓఎస్)గా జిల్లాలో ఎంపిక కావడంతో ఆరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పరిపాలన వ్యయంలో భాగంగా మొదటి విడతలో మంజూరైన రూ.3.16 లక్షల చెక్కులను మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా వనపర్తి జిల్లా నుంచి డీసీసీబీ చైర్మన్, పాన్‌గల్ సింగిల్ విండో అధ్యక్షుడు మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అందుకున్నారు. జిల్లాలోని వనపర్తి, కొత్తకోట, ఆత్మకూర్, గోపాల్‌పేట, పాన్‌గల్, కొప్పునూర్ సహకార సంఘాలు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఎఫ్‌పీఓలుగా ఎంపిక కాబడిన సంఘాలకు కేంద్ర ప్రభుత్వ పథకం కింద అందించిన నగదును వివిధ వ్యాపారాలు, సంఘాల ద్వారా రైతులకు వివిధ రకాల సేవలు అందించడానికి అవసరమైన ఆర్థిక సహాయం, నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు నిర్వహణకు ఉపయోగపడుతాయన్నారు. రెండో విడతలో జిల్లాలోని మిగిలిన 9 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఎఫ్‌పీఓలుగా ఎంపిక కావడానికి తన వంతు కృషి చేస్తానని జిల్లా సహకార అధికారి రాణి పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో క్షేత్ర స్థాయి అధికారులు, సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు



రక్తదాన శిబిరంలో ఉద్యాన కళాశాల విద్యార్థులు

కొత్తకోట రూరల్: రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారికి రక్తం అందించి ప్రాణాలు కాపాడవచ్చని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. పెద్దమందడి మండలం మోజర్ల, మద్దిగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉద్యానవన కళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో మాట్లాడారు. ప్రమాదాలు జరిగినప్పుడు రోగులకు, రక్తం అవసరమున్న వారికి ఈ బ్లడ్ బ్యాంకు ద్వారా అందిస్తారన్నారు. మోజర్ల, మద్దిగట్ల రెండు జంట గ్రామాల నుంచి దాదాపు 23 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ విద్య, భాస్కర్, వైద్యులు జ్యోతి, వర్షిత, ప్రవళిక, రెడ్ క్రాస్ సంస్థ పాలక మండలి సభ్యులు అహ్మద్, రమేష్, జంట గ్రామాల పెద్దలు చాపల సత్యారెడ్డి, బుచిలింగం, మన్యం, హెచ్‌ఎం ఎస్.వరప్రసాదరావు, ఉపాధ్యాయులు డీ.రణదీప్, పి.వెంకటస్వామి, గద్వాల కృష్ణ, ఎ.భగవంతు, పుల్లయ్య, మధుసూదన్, ఎన్.వెంకటస్వామి, చిన్నారెడ్డి ఉన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు ఖండించండి



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

వనపర్తి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. మంగళవారం పెబ్బేరు పట్టణంలో సెంట్రల్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ సీఐటీయూ 4వ మహాసభలు రెండో రోజు సహారా ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ముందుగా సీఐటీయూ జెండాను జిల్లా ఉపాధ్యక్షుడు మహమూద్ ఆవిష్కరించారు. అనంతరం కార్మికులు అమరవీరులకు నివాళులర్పిస్తూ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, ఉపాధ్యక్షురాలు సునిత, అధ్యక్ష వర్గంగా వ్యవరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడారు. ఏబీడీ కంపెనీ కార్మికులపై యజమాన్యం అరాచకాలను ఆపాలని, ఏబీడీ హమాలీ కార్మికుల సంఘం రిజిస్ట్రేషన్ పేరు మార్చిడిని వెంటనే డీసీఎల్ మార్చిడి చేయాలని అధికారులను కోరారు. మహిళ కార్మికులపట్ల యజమాన్యం వ్యవహరిస్తున్న తీరుని ఆయన తీవ్రంగా ఖండించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతూ సీఐటీయూ అండగా ఉంటుందని, కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అవాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల్‌రెడ్డి, మేకల ఆంజనేయులు, ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవిప్రసాద్‌గౌడ్, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు బాలయ్య, శారద, నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



మదనాపురం: 42శాతం బీసీ రిజర్వేషన్స్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తీర్మానం చేయడంతో మండలంలోని నెలివిడిలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు వడ్డె కృష్ణ, మహదేవన్ గౌడ్, అంజాద్ అలీ, సత్యం ముదిరాజ్ రాములు, కుర్మన్న, విజయ్, కొండన్న, బేరి కొండన్న, రమేష్, శ్రీను, స్వామిగౌడ్, మారుతి, వెంకటేష్ యాదవ్, పరశురామ్, నర్సింహాగౌడ్, తాతయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సునీల్ ఆశయసాధన కోసం కృషి చేయాలి

గోపాల్‌పేట: కామ్రేడ్ సునీల్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. మండల కేంద్రంలో సునీల్ వర్ధంతి సందర్భంగా ఆయన స్తూపం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు బ్రెడ్లు అందజేశారు. కార్యక్రమంలో డీ.బాల్‌రెడ్డి, ఆంజనేయులు, గంధం నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ

అమరచింత: మండల కేంద్రంలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండు జతల షూలను మంగళవారం ఎంఈఓ భాస్కర్ సింగ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు కలాంపాషా, ఉపాధ్యాయులు పద్మమ్మ, రాములు, ఆనందలక్ష్మి, శ్రీలత, సుధ, హరిత, మాసూమ్, జ్యోతి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేటకు చెందిన మహిళ కనిపించకపోవడంతో ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జె.నరేష్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. ఖిల్లాఘనపురం మండలం మానాజీపేటకు చెందిన జెట్టి అంజమ్మకు ఈ నెల 12న ఉదయం 8గంటల సమయంలో మహిళా సంఘం డబ్బులు రూ.19 వేల విషయంలో కుమారుడు జెట్టి యాదయ్యతో గొడవ జరిగింది. ఆ డబ్బుల నుంచి అంజమ్మకు రూ.5వేలు ఇచ్చి మిగతా డబ్బులు ఇంట్లో పెట్టి కొడుకు పనులకు వెళ్లిపోయాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన కొడుకుకు తల్లి కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువులతో వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తులపై దాడి: కేసు నమోదు

ఖిల్లాఘనపురం: తల్లి(చిన్నమ్మ), కొడుకు గొడవ పడుతుండగా విడిపించేందుకు మధ్యలో వెళ్లిన ఇద్దరు వ్యక్తులపై దాడి చేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖిల్లాఘనపురం మండలం ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన కుర్వ విజయేందర్ అతని చిన్నమ్మ చెన్నమ్మతో గొడవ పెట్టుకున్నాడు. ఈ సమయంలో 'ఎందుకు చిన్నమ్మతో గొడవ పెట్టుకుంటున్నావు, ఏదైనా సమస్య ఉంటే మాట్లాడుకొండి' అని గ్రామానికి చెందిన కావలి గోపాల్ సర్ది చెప్పేందుకు మధ్యలో వెళ్లాడు. కోపంతో ఉన్న విజయేందర్ గోపాల్‌పై కర్రతో కొట్టాడు. ఈ విషయం తెలిసి గోపాల్‌ను రక్షించేందుకు వచ్చిన అతని మామ వెంకటయ్యను తోసివేయడంతో అతనికి గాయాలయ్యాయి. ఈ విషయమై మంగళవారం గోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ జె.నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కేజీబీవీ ఎస్‌ఓగా స్వప్న



ఆత్మకూర్: ఆత్మకూర్ మండలం బాలకిష్టాపూర్ కేజీబీవీ ఎస్‌ఓగా వనపర్తికి చెందిన కే స్వప్న నియమితులయ్యారు. మంగళవారం జిల్లా విద్యాధికారి అబ్దుల్‌ఘని, జీసీడీఓ శుభలక్ష్మి చేతులమీదుగా నియామకపత్రం అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీ, యూఆర్‌ఎస్‌లకు నిర్వహించిన పోటీపరీక్షల్లో స్వప్న టాపర్‌గా నిలిచారు. ఈమేరకు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



అమరచింత/మదనాపురం: మండలంలోని ధర్మాపురంలో మంగళవారం పోచమ్మ దేవత బోనాల పండుగ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కురుమ, యాదవ సోదరులు డోళ్ల చప్పుళ్ల మధ్య అమ్మవారి ఆలయానికి బోనాలతో వెళ్లి నైవేద్యం సమర్పించారు. ఆలయం ఎదుట పొట్టేళ్లు, కోళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

- మదనాపురం మండలంలోని అజ్జకొల్లులో పోచమ్మ తల్లి బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో మహిళలు యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంప్యూటర్ విద్యపై పట్టు సాధించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



మనిగిళ్ల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి/కొత్తకోట రూరల్: పిల్లలకు బాల్యం నుంచే కంప్యూటర్ విద్యపై పట్టు సాధించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశ పెట్టిన కృత్రిమ మేధస్సు (ఏఐ) శిక్షణ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం ఉదయం కొత్తకోట మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్దమందడి మండలంలోని మణిగిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. 3–5వ తరగతి విద్యార్థులకు నేర్పిస్తున్న కృత్రిమ మేధస్సు శిక్షణను కలెక్టర్ తనిఖీ చేశారు. కంప్యూటర్‌పై విద్యార్థులు చేస్తున్న లెక్కలను నిశితంగా పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఒకే ప్రాంగణంలో ఉన్న 11 పాఠశాలల్లో 3–5వ తరగతి విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు డీఈఓ తెలిపారు. 6 నుంచి 12వ తరగతి కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు ఖాన్ అకాడమీ కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కంప్యూటర్ శిక్షణ ఇస్తున్న అన్ని పాఠశాలల్లో మెరుగైన ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకోవాలని, విద్యార్థులు కృత్రిమ మేధస్సు శిక్షణ తీసుకునేటప్పుడు హె డ్‌సెట్ తప్పకుండా పెట్టాలని సూచించారు. ప్రతి విద్యార్థికి ఇచ్చిన యూజర్ ఐడీ ఎవరి ఐడీ వారే వా డేవిధంగా చూడాలని సూచించారు. 10వ తరగతి లెక్కల సబ్జెక్ట్ బోధించడానికి ప్రత్యేకంగా రూపొందించిన హ్యాండ్ బుక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం లెక్కల సబ్జెక్ట్‌లో ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కావడానికి వీలులేదన్నారు. అనంతరం అక్కడే కొత్తగా నిర్మిస్తున్న పాఠశాల అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణం నిర్ణీత గడువులోగా పూర్తి చేసేవిధంగా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి మమ్మద్ అబ్దుల్ ఘని, కొత్తకోట తహసీల్దార్ యం.వెంకటేశ్వర్లు, పెద్దమందడి తహసీల్దార్ సరస్వతి, సీఎంఓ మహానంది, ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

ఏఐ బోధనకు చర్యలు తీసుకోవాలి

చదువులో వెనుకబడిన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కృత్రిమ మేధస్సు విద్యను బోధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కలెక్టరేట్‌లో కృత్రిమ మేధస్సు విద్య అందించేందుకు ఎంపిక చేసిన ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ఇచ్చిన కంప్యూటర్లను అన్నింటిని బాక్సుల్లోనే ఉంచకుండా బయటికి తీసి పాఠశాలలో అందుబాటులోకి తీసుకురావాలని, ఇందుకు వారం రోజుల గడువుఇస్తున్నట్లు తెలిపారు. కంప్యూటర్లతో పాటు ఇంటర్నెట్ కనెక్షన్ ఇప్పించి విద్యార్థులకు ఏఐ బోధన ప్రారంభించాలన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి రజని

ఖిల్లాఘనపురం: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వనపర్తి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి రజని అన్నారు. మంగళవారం ఖిల్లాఘనపురం మండలం సోళీపురం ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండటం వల్ల భవిష్యత్‌లో ఎలాంటి తప్పిదాలు చేయకుండా ఉండటంతో పాటు ఇతరులను కూడా సన్మార్గంలో నడిచేలా చేయడానికి అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా విద్యాహక్కు చట్టం, బాల్యవివాహాల నిర్మూలన చట్టం, మోటారు వాహనాల చట్టం, పోక్సో చట్టాల గురించి వివరించారు. ఉచిత న్యాయ సలహాల కోసం 15100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జయశంకర్, ప్యానల్ లాయర్ కృష్ణయ్య పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందుతుంది



కొత్తపల్లి తండా దగ్గర పరిశీలిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: సాగునీటి కాల్వలకు భూములు కోల్పోయిన రైతులందరికీ ప్రభుత్వం పరిహారం అందిస్తుందని నీటిపారుదల శాఖ ఈఈ మధుసూదన్ రావు తెలిపారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి తండా దగ్గర వనపర్తి, ఖిల్లాఘనపురం ప్రధాన రోడ్డుకు బుద్దారం కుడి కాలువపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణాన్ని డీఈ ఘఫార్, జేఈ కమల్‌హాసన్, క్వాలిటీ కంట్రోల్ అధికారి దేవానంద్ పరిశీలించారు. ఆ సమయంలో సోళీపురం గ్రామ రైతులు అక్కడికి వచ్చి భూములకు రావలిసిన పరిహారం విషయమై ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాల్వకు భూములు ఇచ్చిన రైతులకు గతంలో పరిహారం ప్రభుత్వం అందించిందన్నారు. అప్పట్లో భూములకు సంబంధించిన వివరాలు, రికార్డులు ఇవ్వడంలో ఆలస్యం చేసిన సుమారు 10 మంది రైతులకు పరిహారం రాలేదన్నారు. వారి వివరాలు కూడా ప్రభుత్వానికి పంపడం జరిగిందని, ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. అందుకు తాము కృషి చేస్తామని చెప్పారు. బుద్దారం కుడి కాల్వ మొత్తం 21.7 కిలో మీటర్లు తవ్వడం జరిగిందన్నారు. ఇందు కోసం ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు.

నోటు పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో ఎంఈఓ శ్రీనివాసులు

పాన్‌గల్: ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న నోటు పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఉన్నత పాఠశాలను సందర్శించి 8,9,10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రాముడు ఆధ్వర్యంలో ఎస్సీ హాస్టల్లో 62 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నరేష్, ఎమ్ ఎల్‌పీహెచ్ నవనీత, ఏఎన్‌ఎమ్ శ్రీదేవి, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నియంత్రణకు ప్రజల సహకారమే కీలకం



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

వనపర్తిటౌన్: ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అందుకు ప్రజల సహకారం కీలకమని మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్ అన్నారు. షాపుల్లో వస్తువులు తీసుకున్నాక ప్రజలు ప్లాస్టిక్ కవర్లు అడగం, షాపు యజమానే సామన్లను ప్లాస్టిక్ కవర్‌లో ఇవ్వడం, అమ్మడం ద్వారా వాటి వినియోగం ఎక్కువవుతుందని, ప్లాస్టిక్ కవర్లు ఇచ్చే షాపులది, తీసుకునే ప్రజలది ఇద్దరిది తప్పేనని వివరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా, తడి,పొడి వ్యర్థాల విభజనపై అవగాహన కల్పించారు. కమిషనర్ ఆదేశాల మేరకు హెల్త్ అసిస్టెంట్ శివ కుమార్ జిల్లా కేంద్రంలోని బేకరీ, షాపింగ్ మాల్, హోటల్స్, బట్టల, కిరాణా తదితర షాపులపై రైడ్ నిర్వహించారు. ఓ హోటల్ అపరిశుభ్రంగా ఉన్నందున రూ.3,000, పలు షాపుల్లో ప్లాస్టిక్ వాడుతున్నందున మొత్తం రూ.9,500 జరిమానా విధించారు.

పాన్‌గల్: ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలకు దూరంగా ఉండవచ్చని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. డ్రై డేలో భాగంగా దావాజిపల్లిలో సిబ్బందితో ఆయన పర్యటించి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అమరచింత: పరిసరాల శుభ్రతలో ప్రజలు భాగస్వామ్యం కావాలని, ప్లాస్టిక్‌ను నిషేధించాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. 5వ వార్డులో ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. వార్డు ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు మంజూరు చేయాలి

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి నుంచి కల్వరాల మీదుగా వీపనగండ్ల వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ కాంగ్రెస్ మండల నాయకులు, మాజీ జెడ్పీటీసీ రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జూపల్లి యువసేన నాయకులు విష్ణు, బాలు, బీరయ్య, శ్రీకాంత్, మల్లి, జానీ, నర్సింహ పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు రుణాలను ఇప్పించండి

అమరచింత: మున్సిపాలిటీ పరిధిలో చిరువ్యాపారాలు చేస్తున్న వారికి ప్రభుత్వ పరంగా బ్యాంకుల ద్వారా రుణాలను ఇప్పించి వారి అభివృద్ధికి మెప్మా సిబ్బంది తోడ్పాటు అందించాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్, ఆర్‌పీలు సమాశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు చిరువ్యాపారులకు రుణాలు ఇప్పించి ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో మెప్మా ఆర్‌పీలు పాల్గొన్నారు.